నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 24 మే 2024 | MAHABUBNAGAR NARAYANPET



శ్రీధర్‌రెడ్డి తండ్రిని ఓదారుస్తున్న కేటీఆర్






బాధిత కుటుంబసభ్యులను ఓదారుస్తున్న బీరం, చిత్రంలో కేటీఆర్

↑ కార్యకర్తలతో కలిసి లక్ష్మీపల్లికి ర్యాలీగా వెళ్తున్న కేటీఆర్

# ఉలిక్కిపడ్డ లక్ష్మీపల్లి

- బీఆర్‌ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి దారుణ హత్య
- వివాదరహితుడిపై గొడ్డళ్లతో దాడి
- రాజకీయవర్గాల్లో మొదలైన కలవరం
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- తరలొచ్చిన నాయకులు, శ్రేయోభిలాషులు
- గులాబీ శ్రేణులకు అండగా ఉంటామన్న కేటీఆర్

## పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం



శ్రీధర్‌రెడ్డికి అంతిమయాత్ర నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు, నాయకులు

లక్ష్మీపల్లికి చెందిన రైతు శేఖర్‌రెడ్డి, యశోదమ్మ దంపతులకు బొడ్డు శ్రీధర్‌రెడ్డి (50), మహేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి సంతానం. శ్రీధర్‌రెడ్డికి వివాహం కాలేదు. దీంతో తల్లిదండ్రులతోపాటు గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేస్తుండగా.. మిగతా ఇద్దరు కుటుంబాలతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తుంటారు. ఉమ్మడిగా ఉంటున్న ఈ కుటుంబానికి 30 ఎకరాల పొలం ఉంది. సాగుతోపాటు బీఆర్‌ఎస్ పార్టీలో ఆయన చురుకుగా తిరిగేవాడు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందాడు. ప్రస్తుతం వేసవి కావడంతో తన ఇంటికి సమీపంలో ఉన్న వారి కల్లం దొడ్డి వద్ద మంచంపై నిద్రపోయేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి కూడా నిద్రపోగా.. అర్ధరాత్రి 12 గంటల తర్వాత విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. గాడ నిద్రలో ఉన్న అతడిపై గొడ్డళ్లతో దాడి చేసి హత్య చేశారు. అయితే నిత్యం తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేచి వచ్చి స్నానం, పూజలు చేసే అతడు 4:30 గంటలైనా ఇంకా రాకపోవడంతో అతడి తల్లిదండ్రులు ఇంటి పక్కనే ఉన్న వ్యక్తిని లేపాలని పంపించారు. అతడు వచ్చి చూడగా శ్రీధర్‌రెడ్డి హత్యకు గురై కనిపించడంతో వెంటనే వెళ్లి వారికి విషయం చెప్పాడు. తల్లిదండ్రులు వచ్చి చూసి కన్నీరుమున్నీరయ్యారు. తెల్లారేసరికి ఈ విషయం మండలం మొత్తం దావానంలా వ్యాపించింది. పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐ నాగభూషణ్‌రావు ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్ బృందం రప్పించారు. మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాధిత కుటుంబసభ్యులు

## ముగిసిన అంత్యక్రియలు

శ్రీధర్‌రెడ్డి మృతితో గ్రామం మూగబోయింది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో హృదయ విదారకంగా మారింది. సాయంత్రం శ్రీధర్‌రెడ్డి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య నిర్వహించారు. గ్రామం జనసంద్రమైంది. శ్రేయోభిలాషులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ, మండల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. ప్రధాన అనుచరుడిని పోగొట్టుకున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి అంతిమ యాత్రలో పాడె మోసి నివాళులర్పించారు. ఉదయం నుంచి శ్రీధర్‌రెడ్డి ఇంటి కుటుంబ సభ్యులకు ధైర్యం నూరిపోశారు. అనంతరం సొంత వ్యవసాయ క్షేత్రంలో అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర ముగిసింది. కాగా, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐ నాగభూషణ్ రావుతోపాటు ఎస్సైలు గ్రామంలో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. గతంలో కొల్లాపూర్ నియోజకవర్గంలో హత్యా రాజకీయాలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫ్యాక్షన్ సంస్కృతి పాకిందని పలువురు చర్చించుకున్నారు.



అశ్రునయనాల మధ్య శ్రీధర్‌రెడ్డి పాడెను మోస్తున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు

వనపర్తి (నమస్తే తెలంగాణ)/చిన్నంబావి, మే 23 : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి ఉలిక్కిపడింది. బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు బొడ్డు శ్రీధర్‌రెడ్డి (50) బుధవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. వివాదరహితుడిగా పేరొందిన నేతపై గొడ్డళ్లతో దాడితో రాజకీయ వర్గాల్లో కలవరం మొదలైంది. రాజకీయంగా ఎలాంటి అలజడులు లేకుండా ఉన్న మండలంలో గుర్తింపు పొందిన నేత హత్య చర్చనీయాంశమైంది. మంచికి మారు పేరుగా నిలిచిన శ్రీధర్‌రెడ్డిని హత్య చేసేంతవరకు ఎందుకు వెళ్లారన్నది మిలియన్ల కొద్ది ప్రశ్న. ఈ హత్య కోసం ముందస్తు పథకం పన్ని అత్యంత చాకచక్యంగా చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులే హత్య చేశారా..? లేక ఇతర ప్రాంతాల వారితో హత్య చేయించారా..? అన్న కోణంలోనూ విచారణ జరుగుతున్నది. ఎలాంటి అలజడికి తావులేకుండా పక్కా ప్లాన్‌తో హత్య జరిగినట్లు పోలీసు అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు భావిస్తున్నారు.




చిన్నంబావిలో ధర్నా చేస్తున్న బీరం, ఆర్‌ఎస్పీ, బీఆర్‌ఎస్ నేతలు

***కన్నీరుపెట్టిన బీరం, నేతలు***

శ్రీధర్‌రెడ్డి హత్య సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మరో నేత అభిలాష్‌రావుతో కలిసి వెంటనే లక్ష్మీపల్లికి చేరుకున్నారు. అతడి మృతదేహాన్ని చూసి కన్నీరు ఆపుకోలేకపోయారు. శ్రీధర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. హత్యకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులకు అండగా ఉంటామని, మనోధైర్యంతో ఉండాలని సూచించారు.

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

వనపర్తి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం చేశాక శ్రీధర్‌రెడ్డి మృతదేహాన్ని చిన్నంబావికి తీసుకొచ్చారు. మృతదేహంతో మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, అభిలాష్‌రావు నేతృత్వంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ధర్నాకు దిగారు. శ్రీధర్‌రెడ్డి హత్యతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు మార్మోగాయి. హత్యకు కారణమైన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రావమ్మ, నాయకులు గోవింద్ శ్రీధర్ రెడ్డి, చిన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చక్రధర్‌గౌడ్, స్వామి, మద్దిలేటి తదితరులు డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాకతో ధర్నాను విరమించి మృతదేహంతో లక్ష్మీపల్లి వరకు దాదాపు 400 మంది నాయకులు, శ్రేయోలాభిలాషులు దాదాపు 4 కి.మీ. పొడవునా సుమారు గంటకుపైగా కాలినడకన చేరుకున్నారు. ర్యాలీలో కాంగ్రెస్ డౌన్‌డౌన్, జూపల్లి డౌన్‌డౌన్ అంటూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ముఖ్యనాయకులు క్రిశాంక్, అభిలాష్‌రావు, శ్రీధర్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులను కేటీఆర్ పరామర్శించారు. గుండె నిబ్బరం చేసుకోవాలని సూచించారు. నేరుగా ఇంటికెళ్లిన కేటీఆర్, శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులు, ఇద్దరు తమ్ముళ్లతో మాట్లాడారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



## స్నేహశీలిగా గుర్తింపు

కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా.. పార్టీలో చురుకైన నేతగా శ్రీధర్‌రెడ్డి గుర్తింపు పొందాడు. లక్ష్మీపల్లిలోనూ, మండలంలోని పలు గ్రామాల్లో ఆయనకు వివాదరహితుడిగా, అందరితో కలివిడిగా.. స్నేహశీలిగా ఉండేవాడు. ఎలాంటి ఘర్షణలకు, దౌర్జన్యాలకు తావు లేకుండా.. ప్రజలతో స్నేహభావంగా మెలిగే వాడని మండల ప్రజలు చెబుతున్నారు. సమిష్టి కుటుంబంగానే ఉంటూ గ్రామంలోనే మంచిపేరు తెచ్చుకున్న శ్రీధర్‌రెడ్డి హత్యను గ్రామ, మండల ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఐదు పదుల వయసున్న ఈ నేతకు ఇటు గ్రామంలోనూ.. అటు మండలంలోనూ మంచి పేరున్నది. వివాహానికి దూరంగా ఉన్న ఆయన వివాదాలకూ దూరంగా ఉంటాడు. ప్రేమపూర్వకంగానే ప్రతిఒక్కరితో మెలిగాడని గ్రామస్తులందరినోట వినిపిస్తున్నది. చిన్నంబావి మండలంలోనే కాకుండా నియోజకవర్గంలో ఈ హత్య చర్చనీయాంశమైంది. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత మండలం చిన్నంబావి కావడంతో ప్రధానంగా చర్చకు కారణమైంది. ఎంతటి కక్షలు, కార్పాణ్యాలున్నా.. ఇలా హత్యల వరకు వెళ్లలేదన్న చర్చ సర్వత్రా జరుగుతున్నది. ఇదిలా ఉంటే, తమ కొడుకును రాజకీయ కక్షతోనే.. స్థానిక మంత్రి ప్రోత్సాహంతోనే హత్య చేశారని శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులు పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే మూడేండ్ల కిందట గ్రామంలో జరిగిన ఓ ఘర్షణలో కేసు నమోదు కావడం.. అరెస్టులు జరగడంపై కూడా చర్చకు దారి తీసింది.

## సీఎం సొంత జిల్లాలోనే హత్యలు : శ్రీనివాస్‌గౌడ్



సీఎం రేవంత్ సొంత జిల్లాలోనే హత్యల పరంపర కొనసాగుతుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. నిరంతరం అలజడులకు తార్కాణంగా ఉన్న రాయలసీమ వంటి ప్రాంతాలు నేడు ప్రశాంతంగా ఉంటే.. ఇక్కడి తెలంగాణ పల్లెలు అశాంతికి.. అలజడికి గురవుతున్నాయని వాపోయారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హత్యలు, అలజడులు, దౌర్జన్యాలు అధికార పార్టీ నాయకుల ఆగడాలు మితిమీరిపోయాయన్నారు. ఇందుకు లక్ష్మీపల్లిలో జరిగిన శ్రీధర్‌రెడ్డి హత్యా ఘటనే ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ప్రశాంతంగా ఉన్న కొల్లాపూర్ ప్రాంతం నేడు ఫ్యాక్షన్‌కు కేరాఫ్‌గా మారుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పదేళ్లలో ఇలాగే హత్యలు జరిగాయా..? అని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. ఈ హత్యల పరంపరను ఇప్పటితో ఆపకపోతే.. గ్రామాల నుంచి మండలాలకు, మండలాల నుంచి తాలూకాలకు, అక్కడి నుంచి రాష్ట్రానికి చేరి రావణకాష్టంలా రాష్ట్రం మారిపోతుందని హెచ్చరించారు.

## శ్రీధర్‌రెడ్డి హత్య హేయనీయం : ఆర్‌ఎస్పీ



లక్ష్మీపల్లిలో శ్రీధర్‌రెడ్డి హత్య హేయమైనదని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడుల పరంపర కొనసాగుతున్నదని, వీటిపై రాష్ట్ర పోలీసు అధికారులను కలిసి విన్నవించామన్నారు. వంగూరు, పెదకొత్తపల్లి, చిన్నంబావి, పెంట్లవెల్లి తదితర మండలాల్లో దాడులు చేయడం, మళ్లీ తమ కార్యకర్తలపైనే కేసులు పెట్టించడం వంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు. ఎంత మొర పెట్టుకున్నా మళ్లీ దాడులు, హత్యల పరంపర కొనసాగుతుందన్నారు. మంత్రిగా జూపల్లి బాధ్యతలు తీసుకున్న తర్వాత పరిస్థితులు మారిపోయాయన్నారు. చిన్నంబావి ఎస్సైపై రాష్ట్ర పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. మంత్రి జూపల్లి అండతో అధికార పార్టీకి అండగా నిలుస్తున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న దాడులు, హత్యల నుంచి మా కార్యకర్తలను ఎలా కాపాడుకోవాలో తమకు తెలుసని, పరిస్థితులు చేయిదాటక ముందే ప్రభుత్వం అప్రమత్తం కావాలని సూచించారు.

## హత్యలో పెద్దల హస్తం : మాజీ ఎమ్మెల్యే బీరం



శ్రీధర్‌రెడ్డి హత్య రాజకీయ కుట్రనే.. హత్యపై సీబీఐ ద్వారా విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దల హస్తం లేకుండా ఈ హత్య జరగలేదని, ఎవరిని కదలించినా ఇదే విషయం తెలియజేస్తారని అన్నారు. హత్య విషయం తెలుసుకొని వందల కిలోమీటర్ల నుంచి మా నాయకుడు కేటీఆర్ రావడం.. మృతుడి కుటుంబానికి, బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కొండంత ధైర్యం నింపిందన్నారు. తన అనుచరుడికి కోల్పోవడం చాలా బాధగా ఉన్నదన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, మీకు అండగా ఉంటామని భరోసా నింపారు.

## రాజకీయ కుట్రనే.. : మాజీ ఎమ్మెల్యే గువ్వల



హత్యా రాజకీయాలకు తెరలేపిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు హెచ్చరించారు. ప్రభుత్వ అండతోనే బీఆర్‌ఎస్ శ్రేణులపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని, ఇటీవలే తాము రాష్ట్ర పోలీసు అధికారులను కలిసి మొరపెట్టుకున్నామని తెలిపారు. దాడులకు ప్రతిదాడులు మా సంస్కృతి కాదని, కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు.

# నాలుగు నెలల్లో రెండు హత్యలు

- కొల్లాపూర్‌లో దాడుల పరంపర
- ప్రేక్షకపాత్ర పోషిస్తున్న పోలీసులు
- కార్యకర్తల సహనానికి పరీక్ష పెట్టొద్దు
- అత్యంత సన్నిహితుడిని కోల్పోయిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, బీరం

వనపర్తి, మే 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెల్లలోనే రెండు హత్యలు జరిగాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లాపూర్ ప్రాంతం హత్యలు, రాజకీయాలకు కేరాఫ్‌గా మారుతున్నదన్నారు. గురువారం లక్ష్మీపల్లిలో హత్యకు గురైన బీఆర్‌ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బీరంహర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు నాయకులు క్రిశాంక్, అభిలాష్‌రావుతో కలిసి కేటీఆర్ పరామర్శించారు. వారికి అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో పనిచేయని వారిని, అధికార పార్టీకి మద్దతుగా పనిచేయని వారిపై కక్షపూరితంగా దాడులు, హత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలోనూ పెద్దకొత్తపల్లి మండలం చిన్నకార్పాములలో మొదటి హత్యకు పాల్పడ్డారన్నారు. ఇప్పుడు చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి శ్రీధర్‌రెడ్డిని హత్య చేయించి ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపారని కేటీఆర్ విమర్శించారు. వరుసగా జరుగుతున్న ఈ హత్యలకు మంత్రి జూపల్లి బాధ్యత వహించాలన్నారు. ఈ నియోజకవర్గంలో మరో ఘటన చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 80 ఏండ్లకు పైబడిన శేఖర్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన కొడుకు హత్యలో మంత్రి జూపల్లి ప్రమేయం ఉన్నదని పేర్కొనడంతో పోలీసులు ఒత్తిడి చేస్తున్నారని చెప్పడం చూస్తే బాధ కలుగుతున్నదన్నారు. దాడులు, హత్యలకు పాల్పడుతున్న అధికారపార్టీ నాయకులు ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. లేదంటే మా కార్యకర్తలను నిలువరించడం కష్టంగా మారుతుందని హెచ్చరించారు. తాము పదేండ్లపాటు పసిడి పంటలు, ప్రశాంతంగా ప్రజల జీవనం ఉండేలా పాలన అందిస్తే.. ఐదు నెలల్లోనే అనేక హత్యలకు తెరలేపి పల్లెల్లో ప్రశాంతతను లేకుండా అధికార కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదన్నారు. సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే జరుగుతున్న హత్యలపై ప్రత్యేక జుడీషియల్ టీంను వేసి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి బాసటగా నిలుస్తామని, శ్రీధర్‌రెడ్డి తల్లిదండ్రులు శేఖర్‌రెడ్డి, యశోదమ్మకు ధైర్యం చెప్పారు.

## మొదటి హత్య మల్లేశ్‌యాదవ్‌దే..



పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్త మాజీ సైనికుడు మల్లేశ్‌యాదవ్ అసెంబ్లీ ఎన్నికల్లో చాలా చురుకుగా పనిచేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు డబ్బులతో ప్రలోభపెట్టినా మల్లేశ్‌యాదవ్ లొంగలేదు. బీఆర్‌ఎస్ తరపున ఎన్నికల ప్రచారం చేయవద్దు అని, ఒకవేళ చేస్తే చంపేస్తామని కాంగ్రెస్ నాయకులు బెదిరించినట్లు మల్లేశ్‌యాదవ్ కుటుంబసభ్యులతో చెప్పుకున్నాడు. కాంగ్రెస్ నాయకులకు భయపడకుండా ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం పనిచేశారు. దీంతో కక్ష పెంచుకున్న కాంగ్రెస్ నాయకులు భూతగాదాలను బూచిగా చూపి 2023 డిసెంబర్ 28న రాత్రి హత్య చేయించారు.

# కొల్లాపూర్‌కు పాకిన ఫ్యాక్షన్ సంస్కృతి

- పాన్‌గల్ ఎంపీపీపై హత్యాయత్నం

కొల్లాపూర్ రూరల్, మే 23 : ప్రశాంతంగా ఉన్న కొల్లాపూర్ వరుస హత్యలతో ఉలిక్కిపడుతున్నది. బీఆర్‌ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకొని రాజకీయ ప్రేరేపిత హత్యలు, దాడులతో స్థానిక మంత్రి కొల్లాపూర్‌ను రావణ కాష్టంలా మార్చారు.



లక్ష్మీపల్లిలో హత్యకు గురైన శ్రీధర్‌రెడ్డి ఇల్లు

2003 డిసెంబర్ 29 నుంచి ఈ ఏడాది మే 23 వరకు కొల్లాపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న వరుస ఘటనలను చూసి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

***మార్కెట్ కమిటీ డైరెక్టర్‌పై దాడి..***

కొల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్‌ను లక్ష్యంగా చేసుకొని పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామంలో 2023 నవంబర్ 29న అసెంబ్లీ ఎన్నికలకు ముందు రోజు రాత్రి పక్కా ప్రణాళికతో మంత్రి అనుచరులు గుజ్జుల పరమేశ్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారు.

***మహిళా సర్పంచ్‌పై దాడి..***

పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడ సర్పంచ్ ఇందిర, బీఆర్‌ఎస్ నాయకుడు రవినాయక్ వాళ్ల అమ్మపై డిసెంబర్ 4న ఎమ్మెల్యే ఫలితాల తర్వాత కాంగ్రెస్ నాయకులు దాడులకు తెగపడ్డారు. అంతేకాదు రాజీ కోసం పిలుచుకొని రవి నాయక్‌పై దాడిచేసి తన కారును ధ్వంసం చేయడంతోపాటు అక్రమ కేసులను బనాయించి రిమాండ్‌కు పంపించారు. ఎంపీ ఎన్నికల పోలింగ్ రోజున బీఆర్‌ఎస్ కార్యకర్త గుడెసెను తగులబెట్టారు.

***అభిలాష్‌రావుపై హత్యాయత్నం..***

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు కారుపై బీరుబాటిళ్లు, ఇనుప రాడ్లతో దాడి చేసి కారులో ఉన్న అభిలాష్‌రావుపై కొల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు హత్యాయత్నం చేశారు.

***పాన్‌గల్ ఎంపీపీపై హత్యాయత్నం..***

పాన్‌గల్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి ఇంట్లోకి జనవరి 25న రాత్రి కాంగ్రెస్ నాయకులు అక్రమంగా చొరబడి కిరోసిన్ పోసి హత్య చేసేందుకు ప్రయత్నం చేశారు.

***బీఆర్‌ఎస్ నేత శ్రీధర్‌రెడ్డి హత్య..***

చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి హత్యతో ప్రశాంతంగా ఉన్న కొల్లాపూర్‌ను దాడుల సంస్కృతికి కేరాఫ్‌గా మార్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

***చిన్నకొత్తపల్లిలో అరాచకం..***

పెద్దకొత్తపల్లి మండలం చిన్నకొత్తపల్లిలో కాంగ్రెస్ నాయకుడి గూండాగిరిని స్థానిక మంత్రి ప్రోత్సహిస్తున్నాడు. చిన్నకొత్తపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు జగపతిరెడ్డిపై కూడా సదురు జూపల్లి అనుచరుడు దాడి చేసి చంపేందుకు ప్రయత్నం చేశారు. ఇదే మండలానికి చెందిన పలు పార్టీలకు చెందిన నేతలపై కూడా దాడులు జరిగాయి.



జగపతిరెడ్డిని పరామర్శిస్తున్న బీరం, ఆర్‌ఎస్పీ (ఫైల్)

